ఘనంగా గాయత్రి యజ్ఞమహోత్సవం



మైలార్‌దేవ్‌పల్లి: శ్రావణపౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మార్కండేయనగర్ శ్రీవీరాంజనేయ ఆలయం, పద్మశాలిపురం శివమార్కండేయ ఆలయం, పద్మశాలి ట్రస్టు భవన్‌లలో భక్తి శ్రద్ధలతో వేద పండితులచే గాయత్రిహోమం నిర్వహించారు. పద్మశాలిపురంలో మార్కండేయ స్వామిని కాలనీలలో ఊరేగింపుగా తరలించారు. గాయత్రిహోమం అనంతరం జంధ్యాలను వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో 35.2 మిల్లీమీటర్ల వర్షం

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 1.10 గంటల నుంచి 2 గంటల వరకు కురిసిన భారీ వర్షం 35.2 మిల్లీమీటర్లుగా నమోదైంది. దీంతో టెర్మినల్ పరిధిలోకి వర్షపు నీరు చేరడంతో జీఎంఆర్ విమానాశ్రయ సాంకేతిక బృందం వెంటనే రంగంలోకి దిగి, వర్షపు నీటిని తొలగించారు. మరోసారి టెర్మినల్‌లోకి నీరు ప్రవేశించకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు జీఎంఆర్ అధికారులు వెల్లడించారు.

వైభవంగా ఫలహారం బండి ఊరేగింపు



శేరిలింగంపల్లి: శ్రావణమాస బోనాల వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి లింగంపల్లిలో ఫలహారం బండి ఊరేగింపును వైభవంగా నిర్వహించారు.యువకుల కేరింతలు, పోతరాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాలు, కళాకారుల నృత్యాలతో ఉత్సాహంగా సాగింది. ఈ వేడుకల్లో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, ఎంబీసీ చైర్మన్ జెరిపేటి జైపాల్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రాజ్ ముదిరాజ్, అనిరుధ్ యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, రవియాదవ్, పాండు ముదిరాజ్, సురేష్, రేవంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలు చిరస్మరణీయం

జియాగూడ: బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలు చిరస్మరణీయమని గౌండ్లమఠం సురాభాండేశ్వర ఆలయ ధర్మకర్తల పాలక మండలి అధ్యక్షుడు గొడిశాల నరేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కొత్త నవీన్‌కుమార్ గౌడ్, ముఖ్య సలహాదారులు నిర్మల నీలకంఠం గౌడ్, బుర్ర భాస్కర్ గౌడ్, గోదా వెంకటేష్ గౌడ్ అన్నారు. సోమవారం కౌండిన్య హాల్‌లో సర్దార్ జయంతిని పురస్కరించుకొని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గడ్డమీది యగ్నేశ్వర్ గౌడ్, కోశాధికారి నిర్మల మనుజేందర్ గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి పంజలా అశోక్ కుమార్ గౌడ్, ధర్మకర్తలు దేశం శంకర హరిప్రసాద్‌గౌడ్, సాయినాథ్ గౌడ్, కొత్త ప్రవీణ్‌కుమార్ గౌడ్, ఎం.శివకుమార్ గౌడ్, గడ్డమీది నాగేందర్ గౌడ్ పాల్గొన్నారు.

సోమేశ్వరరావు సేవలు ఎనలేనివి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ నాటకరంగ సంస్థ రసరంజని ఆధ్వర్యంలో నటుడు దుగ్గిరాల సోమేశ్వరరావు సంస్మరణ సభ సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ.రమణాచారి మాట్లాడుతూ.. రంగస్థల కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. రంగస్థల కళాకారుల సంక్షేమం, రంగ అభివృద్ధికి సోమేశ్వరరావు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత గుమ్మడి గోపాలకృష్ణ, రసరంజని కార్యవర్గ సభ్యులు సేనాపతి, రామకోటేశ్వరరావు, నటరాజ్, దుగ్గిరాల శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

కారులో చెలరేగిన మంటలు

సంతోష్‌నగర్: నడుస్తున్న ఓ కారులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగిన ఘటన సోమవారం కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఉప్పుగూడ వినాయకనగర్‌కు చెందిన ఎ.రాజు సోమవారం తన టాటా ఇండికా కారులో హయత్‌నగర్ నుంచి ఉప్పుగూడ ఇంటికి వెళుతున్నాడు. కాగా పిసల్‌బండ ఎస్‌బీఐ బ్యాంక్ ప్రాంతానికి చేరుకోగానే ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి హాని జరగలేదు. అనంతరం స్థానికులు మంటలను ఆర్పివేశారు.

ఫొటోగ్రఫీ డే వేడుకలు

చందానగర్ : ప్రపంచ ఫొటోగ్రఫీ డేను పురస్కరించుకొని మియాపూర్ డిజిటల్ ఫొటో స్టూడియో అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఫొటో మధుర స్మృతులని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు వాల్మీకి, ఉపాధ్యక్షులు రాజు, కార్యదర్శి విజయ్, సంయుక్త కార్యదర్శి గణేష్ యాదవ్, ట్రెజరర్ అన్వర్ ఖాన్, మీడియా పార్టనర్ మహేష్ దావత్, ఏరియా ఇంచార్జి హర్ష, శ్రీను, ఫొటో గ్రాఫర్లు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైపులైన్ పనుల పరిశీలన



యాకుత్‌పురా: డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నూతన పైప్‌లైన్ పనులు చేపట్టామని రెయిన్ బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ తెలిపారు. యాకుత్‌పురా, బడాబజార్, జాఫర్ రోడ్డు ప్రాంతాల్లో నూతనంగా చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను సోమవారం ఆయన సంతోష్‌నగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పురాతన డ్రైనేజీ పైప్‌లైన్ శిథిలావస్థకు చేరుకోవడంతో నిత్యం ఈ ప్రాంతాల్లో మురుగు నీటి సమస్యలు తలెత్తున్నాయన్నారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. మజ్లిస్ పార్టీ ఏరియా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ గౌస్, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక

రక్షాబంధన్



మణికొండ మాజీ సర్పంచ్‌కు రాఖీ కడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డికి రాఖీ కడుతున్నమహిళా కార్యకర్త



నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడికి రాఖీ కట్టిన సోదరి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని తన నివాసంలో రక్షాబంధన్ సందర్భంగా నియోజకవర్గం నుంచి అనేక మంది మహిళా కార్యకర్తలు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు తన నివాసంలో రాఖీలు కట్టారు. ప్రజా పిత బ్రహ్మకుమారి సోదరీమణులతో రాఖీ కట్టించుకున్నారు. సోమవారం తన నివాసంలో మహిళా కార్యకర్తలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నాళ్లయిన ఎన్నేళ్లయిన చెరిగిపోని బంధం అన్నా చెల్లెళ్ల అనుబంధమని, ప్రతి ఇంటిలో అన్నా చెల్లెళ్లు ఆనందంగా, ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని తెలిపారు.

మణికొండ: సోదరీ, సోదరుల అనుబంధాలు, ఆప్యాయతలకు ప్రతిరూపంగా జరుపుకునే రాఖీ పౌర్ణమి పండగను సోమవారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆడపడుచులు తమ సోదరుల నివాసాలకు వచ్చి వారికి రాఖీలు కట్టి ఆశీస్సులు అందించారు. ఉదయం నుంచే రాఖీ పండగను పురస్కరించుకుని మహిళలు రాఖీలు, స్వీట్ బాక్సులు కొనుగోలు చేసి తమ సోదరుల నివాసాలకు తరలివెళ్లి సోదరులకు రాఖీలు కట్టి వారు ఇచ్చిన కానుకలను తీసుకున్నారు.

అత్తాపూర్: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ వేడుకను బీజేపీ ప్రధాన కార్యదర్శి సాయి యాదవ్ ఇంట్లో ఘనంగా జరుపుకున్నారు.రాఖీ సందర్భంగా మిఠాయిలు, రాఖీ దుకాణాలు కిటకిటలాడాయి. మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

శంషాబాద్: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ నేపథ్యంలో రాఖీ దుకాణాలు సందడిగా కనిపించాయి. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ రాఖీ కట్టారు. కాంగ్రెస్ సీనియర్ నేత కె. చంద్రారెడ్డికి వారి సోదరి రాఖీ కట్టారు.

రాజేంద్రనగర్: రాఖీ పండుగను రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ప్రజలు సోమవారం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. దూర ప్రాంతాల నుండి అక్కా చెల్లెళ్లు తమ తమ్ముళ్లకు, అన్నలకు రాఖీ కట్టేందుకు ఉదయం నుండి తరలివచ్చారు. దీంతో ప్రతి ఇంట్లో పండుగ వాతావరణం కనిపించింది. రంగారెడ్డి జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షురాలు ఉమామహేశ్వరిరెడ్డి డీసీపీ శ్రీనివాస్‌తో పాటు జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్ రవి కుమార్‌లకు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ తన సోదరులకు రాఖీ కట్టారు.



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు



పుప్పాలగూడలో సోదరులకు రాఖీలు కట్టిన చిన్నారులు



జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్‌కు రాఖీ కడుతున్న మహిళలు



సోదరి చేత రాఖీ కట్టించుకుంటున్న కాంగ్రెస్ సీనియర్ నేత కె. చంద్రారెడ్డి



సోదరుడికి రాఖీ కడుతున్న మహిళ



డీసీపీ శ్రీనివాస్‌కు రాఖీ కడుతున్న ఉమామహేశ్వరిరెడ్డి



రాఖీలు కట్టించుకున్న టీపీసీసీ అధికార ప్రతినిధి, సోదరులు



తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క



సోదరితో రాఖీ కట్టించుకున్న మాజీ ఎంపీటీసీ రాము



రాఖీ కడుతున్న చిన్నారి, మహిళ

నాలా ఆక్రమణ తొలగింపు

మణికొండ: ఓ వైపు చెరువులు, నాలాల ఆక్రమణలను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసి భారీగా కూల్చివేతలు చేస్తుంది. ఇలాంటి సమయంలో మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే అనేక చోట్ల ఆక్రమణలకు గురై వరద వచ్చినపుడు ఏకంగా అపార్టుమెంట్లలోకి, గృహాల్లోకి నీరు వస్తుండగా దాన్ని మరింత ఆక్రమణకు కొందరు ప్రబుద్ధులు పాల్పడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ, బయాద్ కాలనీ, సెక్రటేరియట్ కాలనీలలో పందెన్‌వాగు నాలాతో పాటు ఏకంగా ప్రభుత్వ, పార్కు భూములను ఆక్రమించిన సంఘటనలు ఉన్నాయి. అవన్నీ సరిపోవన్నట్టు ఇటీవల వెంకటేశ్వర కాలనీలో నాలా పక్కనే ఓ ప్రహరీ, ఓ గదిని నిర్మించి ఆక్రమణకు పాల్పడ్డారు. అదే విషయాన్ని కాలనీ వాసులు మణికొండ మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం స్పందించిన మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ ప్రహరీని తొలగించారు. సదరు భూమిలో ఉన్న గదిని అలాగే వదిలేయటం పట్ల కాలనీ వాసులు విమర్శలు చేస్తున్నారు. దాన్ని వెంటనే తొలగించాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.



బఫర్ స్థలంలో ప్రహరీని తొలగించిన అధికారులు

ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు



వరదనీరు వెళ్లేందుకు చర్యలు చేపడుతున్న సిబ్బంది

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత బస్తీల్లో వరదనీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. బుద్వేల్ ప్రాంతాలోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇండ్లలోకి నీళ్లు చేరాయి. ఈ నేపథ్యంలో వర్షం కురిసిన ప్రతీసారి ఇళ్లల్లోకి నీరు చేరుతుందని, వరదనీరు వెళ్లేందుకు సరైన దారి కూడా లేదని స్థానికులు శ్రీనివాస సేవా సమితి చైర్మన్ సాయి మల్లిక్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సాయి మల్లిక్ జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులకు సమస్యను వివరించడంతో అధికారులు తమ సిబ్బందితో వరదనీటి తొలగింపు పనులను చేపట్టారు. డ్రైనేజీ సైతం నిండుకోవడంతో జలమండలి సిబ్బంది డ్రైనేజీ నీరు సాఫీగా వెళ్లేందుకు తగు చర్యలు చేపట్టారు.



ఎన్‌సీఈటీ ద్వారా 'మనూ' ప్రవేశాలు

రాయదుర్గం: మనూలో నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎన్‌సీఈటీ)లో అర్హత సాధించిన అభ్యర్థులకు ప్రవేశాలను కల్పిస్తామని 'మనూ' డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వనజ సోమవారం తెలిపారు. ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. బీఎడ్(సెకండరీ) బీఎస్సీ బీఎడ్(ద్వితీయ) బీకామ్ బీఈడీ(సెకండరీ) కోర్సులకు దరఖాస్తులను కోరుతున్నామన్నారు. అభ్యర్థులు ఆగస్టు 25వ తేదీ వరకు అడ్మిషన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

చదువుతో ఉజ్వల భవిష్యత్తు

గోల్కొండ: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉందని పీస్ ఫోర్స్ సొసైటీ నగర అధ్యక్షుడు మహ్మద్ నజీబ్ అన్నారు. సోమవారం టోలిచౌకీలోని కార్యాలయం వద్ద ఆయన పలువురు చిరువ్యాపారులు, ప్రైవేటు ఉద్యోగులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా చదువు ప్రాధాన్యతను ఆయన వారికి వివరించారు. తమ స్తోమతను బట్టి ప్రతిఒక్కరూ తమతమ పిల్లలను చదివించాలని ఆయన సూచించారు.

కళలతోనే జాతీయ సమైక్యత సాధ్యం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రావణ సౌరబాలు పేరిట సోమవారం రవీంద్రభారతిలో హాస్య, సంగీత, నృత్య విభావరిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు వల్లీశ్వర్ మాట్లాడుతూ..జాతీయ సమైక్యత కళల ద్వారానే సాధ్యమన్నారు. సమాజంలో అనేక ఇబ్బందులు ఉన్నా సాంస్కృతిక సంస్థలు కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అనంతరం చిన్నారులను అభినందించారు. అదేవిధంగా సఖియా సాంప్రదాయ వస్త్రాధారణ ప్రదర్శన ఆకట్టుకోగా మోహన్‌కృష్ణ బృందం చేసిన హాస్యం నవ్వుల జల్లులను కురిపించాయి. ఈ కార్యక్రమంలో విజయవాడ ఇంటలిజెన్స్ ఎస్పీ, యు.రామ్మోహన్, సినీనటి సంధ్య, ఫ్యాషన్ డిజైనర్ కావ్యరెడ్డి, కథక్ నాట్యగురువు అంజిబాబు, ట్రస్టు వ్యవస్థాపకురాలు పాలపర్తి సంధ్యారాణి, కన్వీనర్ రఘుశ్రీ పాల్గొన్నారు.

పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి

- 'మనూ' వీసీ సయ్యద్ ఐనుల్ హసన్

రాయదుర్గం: భాషా అధ్యయనాలను అభివృద్ధి చేయడంలో పరిశోధనలకు ప్రాముఖ్యత ఇవ్వాలని మనూ వీసీ ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్ తెలిపారు. సోమవారం విశ్వవిద్యాలయంలో ఉర్దూ కల్చర్ స్టడీస్ సెంటర్ (సీయూసీఎస్) ఆధ్వర్యంలో 'భాషలలో పరిశోధనా పద్ధతి'పై ఒకవారం పాటు నిర్వహించే వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాప్‌లు భాషా రంగంలోని అవసరాలను పరిశోధక విద్యార్థుల అవసరాలను తీరుస్తాయన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ అకడమిక్ ఎక్స్‌లెన్స్‌ను పెంపొందించడంలో పరిశోధనలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. పరిశోధనా పద్ధతుల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు అజీజ్‌బాను, సిద్దిఖీమహ్మద్ మహమూద్, మహ్మద్ నసీముద్దీన్‌ఫారిస్, డాక్టర్ ఎండి షబ్బీర్‌అలీ ప్రసంగించారు.



సమావేశంలో వీసీ ఐనుల్ హసన్, అతిథులు

జాతీయ సెమినార్ ప్రారంభం

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తోపాటు రియల్ ఇంటెలిజెన్స్‌ని కూడా ఉపయోగించాలని ఉర్దూ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ సూచించారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో గ్రంథాలయ శాస్త్ర విభాగం, నింబస్ సంయుక్త ఆధ్వర్యంలో ఏఐ ఎనేబుల్ డిజిటల్ లైబ్రరీస్- ట్రాన్స్‌ఫార్మింగ్ యాక్సెస్ అండ్ డిస్కవరీ అనే అంశంపై ఒకరోజు జాతీయ సెమినార్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యాబోధనకు సాంకేతికతను జోడిస్తే విద్యార్థులకు సులభంగా అర్థమవుతుందన్నారు.

రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలి

ఏఐఓబీసీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్

రాయదుర్గం: రిజర్వేషన్ లేకుండా లాటరల్ ఎంట్రీ రిక్రూట్‌మెంట్ రాజ్యాంగ హక్కుల ఉల్లంఘననేనని అఖిల భారత ఓబీసీ విద్యార్థుల సంఘం (ఏఐఓబీసీఎస్‌ఏ) జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ వద్ద ఆయన మాట్లాడుతూ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 45 ఉద్యోగాల కోసం జాయింట్ సెక్రటరీ, డిప్యూటీ సెక్రటరీ, డైరెక్టర్ స్థాయిలో నేరుగా లాటరల్ ఎంట్రీ ద్వారా నియమించడాన్ని తీవ్రంగా ఏఐఓబీసీఎస్‌ఏ వ్యతిరేకిస్తుందన్నారు. ఈ నియామకాలలో రిజర్వేషన్ నిబంధనలు లేకపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. రిజర్వేషన్ ప్రకారం ఈ 45 పోస్టులలో దళితులు, ఓబీసీలు, ఆదివాసి వర్గాల నుంచి ఎంపిక చేసేవారని గుర్తు చేశారు. ప్రభుత్వం దీన్ని పరిశీలించి, లేటరల్ ఎంట్రీ నియామకాల్లో రిజర్వేషన్లు ఖచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

యాకుత్‌పురా: న్యాయవాదులపై జరుగుతున్న దాడులపై భవిష్యత్తు కార్యాచరణ కోసం ఈ నెల 24న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నామని హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టు అధ్యక్షుడు వై. శ్రీనివాసా చారి తెలిపారు. ఇటీవల బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో న్యాయవాదిపై జరిగిన దాడికి నిరసనగా ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ పిలుపు మేరకు సోమవారం పురానీహవేలీలోని సిటీ సివిల్ కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 24న నిర్వహించనున్న సమావేశానికి హైకోర్టు బార్ కౌన్సిల్ చైర్మన్, సభ్యులు, రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శిలు, పలు పార్టీలకు చెందిన న్యాయవాద ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాజకీయ పార్టీల లీగల్ సెల్ సభ్యులు హాజరవుతారన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుబ్బాక హర్షవర్ధన్, సంయుక్తా కార్యదర్శి బర్కు రాజేష్ కుమార్, తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కో కన్వీనర్ ఏ.మాణిక్ ప్రభుగౌడ్, న్యాయవాదులు శివకుమార్ దాస్, అశోక్, ప్రవీణ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిటీ సివిల్ కోర్టు అధ్యక్షుడు శ్రీనివాసా చారి